నేతల హామీలు.. నెరవేరేదెప్పుడో?



గానుగుపహాడు వాగుపై అసంపూర్తిగా వంతెన

జనగామ, న్యూస్‌టుడే: జనగామ, కరీంనగర్ జిల్లాల మధ్య దూరభారాన్ని తగ్గించే జనగామ-హుస్నాబాద్ ప్రధాన రహదారి వడ్లకొండ సమీపంలో గానుగుపహాడు వాగుపై దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన.. ఎన్నో ఏళ్లు సేవలందించి దెబ్బతినగా, మూడేళ్ల క్రితం కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదించారు. ఏప్రిల్ 2023లో పనులు ప్రారంభించారు. 80 శాతం పూర్తి అయ్యాక చేసిన పనికి బిల్లులు ఇవ్వలేదని గుత్తేదారు పనులు నిలిపివేసి, ఏడాది గడుస్తోంది. పనుల పునః ప్రారంభానికి 'ఈనాడు' పరిష్కార వేదిక పక్షాన ప్రజల అవసరాన్ని, సమస్య తీవ్రతను భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్‌రెడ్డి, అధికార పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వివరించింది. అందరూ సానుకూల స్పందించినా, హామీ హామీగానే ఉంది.

పరిశీలించారు.. తాత్కాలికంగా బాగు చేశారు..

అంతటా భారీ వర్షాలతో వరదలు పోటెత్తాయి. జనగామ నియోజకవర్గంలో గతంలో మాదిరి వర్షాలు లేవు. ఓ మోస్తరు వర్షాలకే రెండు మాసాల క్రితం తాత్కాలిక మట్టిదారికి గండి పడింది. బస్సులు, భారీ వాహనాలు గానుగుపహాడు మీదుగా, ఇతర గ్రామాల మీదుగా ప్రయాణించి వ్యయ ప్రయాసలకు గురయ్యారు. కాంగ్రెస్, భారాస ఇతర పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు, కలెక్టర్ సహా పలువురు అధికారులు ఇక్కడ దుస్థితిని చూశారు. ఇంకేముంది పనులు పునః ప్రారంభమవుతాయని ప్రజలందరూ అనుకున్నా, తాత్కాలికంగా దారికి మరమ్మతు చేయించి, వదిలేశారు.

కీలక రహదారిలో పొంచి ఉన్న ముప్పు

జనగామ జిల్లాతో సరిహద్దుగా ఉన్న కరీంనగర్ జిల్లాకు వెళ్లేందుకు ఇది దగ్గరి దారి. ఈ మండలంలోని 10 గ్రామాలతో పాటు, నర్మెట్ట మండలంలోని 20 గ్రామాలకు, పొరుగు జిల్లాకు చెందిన వేలాది మంది నిత్యం ఈ దారిలో ప్రయాణిస్తుంటారు. ఇసుక, కంకర, లారీలు, రైతుల ట్రాక్టర్లు, ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. మట్టికట్టకు ప్రమాదం పొంచి ఉంది. వరద నీటితో రైతుల భూమి కోతకు గురవుతోంది. ఈ విషయమై గతంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి జనగామకు వచ్చి ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్షించి, పనుల మొదలయ్యేలా చూస్తానని 'న్యూస్‌టుడే'కు తెలిపినా, ముందుకు జరగడంలేదు. రైతులు, విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలకు సేవలందించే ఈ వంతెన పనులు పూర్తయితే ఎంతో మేలు జరగనుంది. ప్రజల అవసరాలతో ముడిపడిన వృథగా నాయకులు గుర్తించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి..

- చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీ

సోమవారం జనగామలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో అసంపూర్తి వంతెన సమస్య గురించి 'న్యూస్‌టుడే' వివరించింది. ఆర్‌అండ్‌బీ మంత్రితో మాట్లాడి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బిల్లులు వస్తే పూర్తి చేస్తా.. - రాజారావు, గుత్తేదారు

చేసిన పనులకు బిల్లులు రావాల్సి ఉందని, తనవైపు ప్రయత్నాలు చేస్తున్నానని గుత్తేదారు రాజారావు వివరించారు. పనులు పూర్తి చేయడంలో వెనుకడుగు వేసేది లేదన్నారు. ప్రజాప్రతినిధుల సహకారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



ప్రమాదకరంగా తాత్కాలిక దారి

'డంపుయార్డులో ఏం ఎత్తుకుపోతారు'



డంపుయార్డులో బయోమైనింగును పరిశీలిస్తున్న సీడీఎంఏ పీవీ గౌతమ్, అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ జమున, ఇతర అధికారులు

జనగామ, న్యూస్‌టుడే: 'డంపుయార్డులో దొంగలు ఎత్తుకుపోవడానికి ఏముంటుంది? ఎందుకు భారీ వ్యయంతో ప్రహరీ నిర్మించాలని' రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ పీవీ గౌతమ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆ నిధులను సేంద్రియ ఎరువుల తయారీకి, అవసరమైతే మరిన్ని పారిశుద్ధ్య వాహనాలను సమకూర్చుకునేందుకు, యార్డు నిర్వహణకు వెచ్చించవచ్చునని సూచించారు. అవసరమైతే కంచె వేస్తే చాలన్నారు. అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి సోమవారం జనగామ మున్సిపల్ పరిధిలో ఆయన పర్యటించారు. ముందుగా చంపక్‌హిల్స్ లోని పురపాలిక డంపుయార్డును సందర్శించి, బయోమైనింగును పరిశీలించారు. 57వేల టన్నుల వ్యర్థాలకు గాను 35 వేల టన్నుల వ్యర్థాల బయోమైనింగ్ జరిగిందని అధికారులు ఆయనకు వివరించారు. వర్మి కంపోస్టు ఎరువు తయారీ నిబంధనలను అనుసరించాలని, పొడిచెత్త నిల్వలను 24 గంటల్లో తరలించి సమాచారం తనకు పంపించాలని కమిషనర్ వెంకటేశ్వర్లును ఆదేశించారు. స్థానిక ఇందిరమ్మ ఇళ్ల సముదాయాన్ని పరిశీలించారు. ఐదేళ్లుగా నిర్మాణాలు ఎందుకు పూర్తి కాలేదని గృహ నిర్మాణ శాఖ ఈఈ దామోదర్‌రావును, పీఆర్ అధికారులను వివరణ కోరారు. నిధులకు కొరత లేదని పనులు పూర్తి చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.జమున, కౌన్సిలర్లు కళ్యాణి, బొట్ల శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు మహిపాల్, గజ్జెల రాములు, గోపయ్య, ఎం.మధు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీ కోసం పని చేసే వారికే పదవులు వరిస్తాయని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్‌గా జూలుకుంట్ల లావణ్య, వైస్ ఛైర్మన్‌గా నూకల ఐలయ్య, డైరెక్టర్లతో జిల్లా మార్కెటింగ్ అధికారి బి.నరేందర్ ప్రమాణ స్వీకారం చేశారు. సమావేశంలో కడియం మాట్లాడుతూ.. పార్టీ కోసం చాలా మంది పని చేస్తున్నారని, వారి పూర్తి సమాచారం తన వద్ద ఉందని వారికి రానున్న రోజుల్లో తప్పకుండా అవకాశం లభిస్తుందన్నారు. నాతో పాటు కాంగ్రెస్‌లో చేరిన వారు బాధపడేలా వ్యాఖ్యలు చేయని వారిని ఒప్పించి మొదటి నుంచి పార్టీ జెండా మోసిన వారికి మార్కెట్ కమిటీలో చోటు కల్పించినట్లు వివరించారు. ఎమ్మెల్సీ, డీసీసీ ఆహ్వానం మేరకే తాను కాంగ్రెస్‌లో చేరానని.. నియోజకవర్గంలోని ఏడు మండలాల అభివృద్ధిపై ప్రత్యేక ఏజెండా ఉందన్నారు. పార్టీలో గ్రూపు రాజకీయాలకు తావులేదని అలాంటి వాటికి పాల్పడితే సహించేది లేదని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి జున్ను భాస్కర్, డైరెక్టర్లు భాస్కుల కిరణ్, యశ్వంత్, వెంకటేశ్వర్లు, సుధాకర్, నాయకులు శిరీష్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, ఇంద్రరెడ్డి, సతీష్, పాతికుమార్ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేయని డైరెక్టర్..

డివిజన్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన కాసాని బొందయ్య సోమవారం పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రమాణం స్వీకారం చేయలేదు. ఛైర్మన్ పదవి ఆశించినా రాకపోవడం, వైస్ ఛైర్మన్ సైతం రాకపోవడంతో నిరాశ చెంది ఈ నెల 10న మార్కెట్ కార్యదర్శికి తన రాజీనామా పత్రాన్ని అందించారు.

వెతలు చెప్పుకొని.. వేదన తీర్చమని!



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఆర్డీవోలు కొమురయ్య, వెంకన్న

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక సమస్యలు పరిష్కరించాలని కొందరు, పలుమార్లు అర్జీలు అందజేసినా తమ భూసమస్యలకు పరిష్కారం చూపడం లేదని మరి కొందరు, ఆర్థికంగా వెనకబడిన తమను ఆదుకోవాలని పలువురు. ఇలాంటి అనేక సమస్యలు ప్రజావాణి దృష్టికి వచ్చాయి. సోమవారం జనగామ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ విభాగపు అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, జనగామ, స్టే.ఘన్‌పూర్ ఆర్డీవోలు కొమురయ్య, వెంకన్న ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వీలైనంత త్వరగా ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పండగ నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమం వెలవెలబోయింది. 17 దరఖాస్తులు మాత్రమే రావడం గమనార్హం.

వార్డు సమస్యలపై ఫిర్యాదు



వీరు జనగామ పట్టణంలోని గిర్నిగడ్డ తొమ్మిదో వార్డుకు చెందిన స్థానికులు. ఈ వార్డులో గత 20 రోజులుగా మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో వార్డులో అపరిశుభ్రత నెలకొందని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చెత్త నిల్వలు, మురుగుకాల్వల అపరిశుభ్రతతో విష జ్వరాలు వ్యాపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అక్రమ అనుమతులు రద్దు చేయాలని



అక్రమ ఇంటి నిర్మాణ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన పలువురు ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఓ సర్వే నెంబర్‌లో తాము ఇంటి నిర్మాణం కోసం అనుమతులు తీసుకుంటే వేరొకరికి అక్రమ నిర్మాణానికి అనుమతులిచ్చారని విన్నవించారు. అధికారులు విచారణ చేపట్టినా ఎలాంటి సమాధానం ఇవ్వడం లేదని, నిర్మాణ అనుమతులు రద్దు చేయాలని కోరారు.

అర్హత ఉన్నా ఇల్లు ఇవ్వట్లేదు



చేతులు జోడించి అధికారులను వేడుకుంటున్న ఈవిడ పేరు చింత లక్ష్మి. దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన ఈమెకు దివ్యాంగుల(చెవిటి) కోటాలో రెండు పడకల ఇల్లు మంజూరైంది. మూడేళ్లుగా కాలయాపన చేస్తున్నారే తప్పా అర్హత ఉన్నా కేటాయించకపోవడంతో బాధితురాలు నేరుగా ప్రజావాణిని ఆశ్రయించింది. తన సమస్యను అదనపు కలెక్టర్‌కు వివరించగా ఆయన రిపోర్టులన్నీ పరిశీలించారు. తహసీల్దార్‌తో మాట్లాడి ఇల్లును అందేలా చూడాలని సూచించారు.

పట్టా చేయాలని నెలలుగా తిరుగుతున్నా..

స్వాతంత్ర్య సమరయోధుడైన తన భర్త పేరు మీద ఉన్న భూమిని తన పేరిట పట్టా చేయాలని కోరుతూ జనగామ పట్టణానికి చెందిన 87 ఏళ్ల వృద్ధురాలు తాటి లక్ష్మి గత రెండు నెలలుగా కలెక్టరేట్‌లోని అధికారులను కలుస్తున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నమిలిగొండలో తన భర్త తాటి సమ్మయ్య పేరు మీద ఉన్న 1.30 ఎకరాల భూమిని తన పేరిట మార్చాలని కోరింది. అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ పూర్తి స్థాయి ఫైల్‌ను పరిశీలించి మండల రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విచారణాధికారిగా ఆర్డీవోతో పాటు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుహాసినిని నియమించి తగు న్యాయం చేస్తామని ఆమెకు హామీ ఇచ్చారు.

మరికొన్ని అర్జీలు ఇలా..

జనగామ పట్టణానికి చెందిన ఎ.అనిత ఒంటరిగా బతుకుతున్న తనకు అంత్యోదయకార్డు మంజూరు చేయాలని కోరారు. ● పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన నర్సోజీ నిరుపేదనైన తనకు రేషన్‌కార్డు మంజూరు చేయాలని, పింఛన్ ఇప్పించాలని కోరారు. ● పట్టణానికి చెందిన పత్తిపాక దినేశ్ దివ్యాంగుడిగా ఇబ్బందులు పడుతున్నానని, జీవనోపాధికి పింఛన్ మంజూరు చేయాలని, ఇలా పలు సమస్యలు ప్రజావాణి దృష్టికి వచ్చాయి.

దేశవ్యాప్తంగా 150 దేవాలయాల అభివృద్ధి



వరంగల్ భద్రకాళి అమ్మవారి చెంత కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, భాజపా నాయకులు

రంగంపేట, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా 150 దేవాలయాల్లో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. సోమవారం వరంగల్ నగర పర్యటనకు విచ్చేసిన కేంద్ర మంత్రి ఓరుగల్లు నగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీభద్రకాళి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో అయోధ్య, వారణాసితో పాటు అనేక దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. తెలంగాణలో జోగులాంబ, భద్రాచలం, రామప్ప, బల్కంపేట అమ్మవారి ఆలయాలు అభివృద్ధి పరుస్తున్నట్లు వివరించారు. ప్రతి పండగలో యువత భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్నారని, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల పెద్దల పట్ల గౌరవం, సంస్కృతి సంప్రదాయాలు తెలుస్తాయన్నారు. కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా శ్రీభద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నానని, కశ్మీర్ ఎన్నికల ఇన్‌ఛార్జి బాధ్యతలు ఉండటంతో కొంత ఆలస్యమైందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు. ప్రధాని మోదీ కూడా అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో భాజపా వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకులు రావు పద్మ, గంట రవికుమార్, ఎం.ధర్మారావు, డా.విజయచందర్‌రెడ్డి, డా.కాళీప్రసాద్, కొండేటి శ్రీధర్, సత్యపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆచార్య సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



రైతన్న ఆలోచన అదిరింది



ప్రస్తుత సాగు రంగంలో అనేక మంది రైతులు మూస పద్ధతిలో పంటలు పండిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి, కంది, మొక్కజొన్నలనే సాగు చేస్తున్నారు. కూరగాయలు, పప్పుదినుసులు, ఇతరాలను పూర్తిగా విస్మరిస్తున్నారు. ఈ తరుణంలో ఓ రైతు విభిన్నమైన ఆలోచనతో పంటలు పండిస్తున్నారు. జనగామ మండలం గానుగుపహాడ్‌కు చెందిన రైతు దావెర శ్రీశైలం వరి పండిస్తుండగా, ఒడ్డు(ఒరాలు)పైన కంది, బొబ్బెర, టమాట, బుడిమె కాయలు సాగు చేస్తుండగా, ఆలోచన బాగుందంటూ పలువురు అభినందిస్తున్నారు. – న్యూస్‌టుడే, జనగామ రూరల్

మార్కెట్ కార్యవర్గానికి ఎంపీ చామల సత్కారం



జనగామ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శివరాజ్‌యాదవ్‌ను అభినందిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి, నాయకులు

జనగామ, న్యూస్‌టుడే: భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి జనగామలో పర్యటించారు. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి సోమవారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన చిందు యక్షగాన కళాకారుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను అభినందించి శాలువాతో సత్కరించారు. స్థానిక మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఎంపికైన బనుక శివరాజ్‌యాదవ్, కమిటీ సభ్యులతో కలిసి ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా నూతన ఛైర్మన్, సభ్యులను ఎంపీ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

వంతెన నిర్మాణం చేపట్టాలని వినతి..

జనగామ రూరల్: మండలంలోని చీటకోడూరు-జనగామ మధ్య యశ్వంతాపూర్ వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతూ బ్రిడ్జి సాధన సమితి ఆధ్వర్యంలో ఎంపీ చామలకు సోమవారం జనగామలో వినతిపత్రం అందజేశారు. రెండేళ్ల క్రితం కురిసిన వర్షాలకు వంతెన కొట్టుకుపోయి, రాకపోకలు నిలిచి పోతున్నాయని బ్రిడ్జి సాధన సమితి కన్వీనర్ యాసారపు కరుణాకర్ కోరారు. నాయకులు సిద్దయ్య గౌడ్, శ్రీనివాస్, వెంకటేశ్, చిరంజీవి పాల్గొన్నారు.

కలాం మాట.. విజయ బావుటా!

నేడు ప్రపంచ విద్యార్థుల దినోత్సవం



పూరి గుడిసెలో.. దీప కాంతుల్లో.. చదువుకున్న ఆ వ్యక్తి ప్రపంచం గర్వించదగ్గ శాస్త్రవేత్త అవుతారని ఎవరూ ఊహించలేదు.. శాస్త్రసాంకేతిక రంగాల్లో అద్భుత విజయాలతో అభిమానం చూరగొని రాష్ట్రపతిగా అత్యున్నత పదవి అలంకరించారు. నిరంతర అధ్యయనం మహోన్నతుడిగా నిలిపింది. అంతేకాదు.. స్ఫూర్తి నింపేలా ప్రసంగాలు చేసి విద్యార్థులను ఆకట్టుకున్నారు. ఆయనే దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం. నేడు ఆ మహనీయుడి జయంతి సందర్భంగా 'ప్రపంచ విద్యార్థుల దినోత్సవం' జరుపుకొంటున్నారు. ఈ నేపథ్యంలో యువతలో స్ఫూర్తినింపే కలాం మాటలు.. ఆ బాటలో సాగుతున్న వారి స్ఫూర్తిగాథలతో 'ఈనాడు' ప్రత్యేక కథనమిది..

–ఈనాడు, మహబూబాబాద్

'యువత ఉద్యోగార్థుల నుంచి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి'

పరి'శ్రమ' ఫలించి.. ఉపాధి కల్పిస్తూ..



బీటెక్ విద్య నభ్యసించే యువకులు ఎవరైనా మంచి ఉద్యోగం సాధించాలనే లక్ష్యంగా ముందుకెళ్తారు. కానీ, మహబూబాబాద్ పట్టణానికి చెందిన భూక్య యశ్వంత్‌నాయక్ బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నప్పుడే వ్యాపారవేత్త కావాలని, కొంతమందికి ఉపాధి కల్పించాలని ఆలోచించారు. 2021లో రూ.35 లక్షలతో జూట్ సంచుల తయారీ పరిశ్రమ నెలకొల్పారు. ఎన్ని సమస్యలు వచ్చినా పట్టుదలతో ముందుకెళ్లి.. నేడు 20 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

'విజయం సాధించాలనే సంకల్పం, తగినంత బలం ఉంటే.. వైఫల్యం నన్ను ఎప్పటికీ అధిగమించదు'..

యావత్ దేశం గర్వించేలా..



ఓరుగల్లు యువకుడు ఇరిగేశి అర్జున్ చదరంగంలో ప్రపంచ చెస్ ఒలింపియాడ్ టైటిల్ కైవసం చేసుకొని యావత్ దేశం గర్వించేలా చేశారు.. 2018లో తెలంగాణ నుంచి గ్రాండ్‌మాస్టర్, 2022లో సూపర్ గ్రాండ్‌మాస్టర్ హోదా సాధించిన మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. 21 ఏళ్ల యువ క్రీడాకారుడు అపజయాలకు కుంగిపోకుండా ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేస్తున్నారు.

'చిన్న లక్ష్యం నేరం.. లక్ష్యం గొప్పదై ఉండాలి'

అయిదు ఉద్యోగాలు సాధించి..



పలువురికి స్ఫూర్తిగా నిలిచేలా గొప్ప లక్ష్య శిఖరాన్ని ఛేదించేవారు ఎందరో.. అలాంటి వారిలో వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన వడ్లూరి రమ, ఉపాధ్యాయుడు విష్ణు దంపతుల కుమార్తె శ్వేత ఒకరు. ఈ-సెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి ఎంటెక్ పూర్తి చేశారు. పోటీ పరీక్షలు రాసి ఐదింటిలో ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ శాఖ కరీంనగర్ సబ్ డివిజన్‌లో ఏఈఈగా పనిచేస్తున్నా.. త్వరలోనే పాలిటెక్నిక్ లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరి ఎంతో మంది విద్యార్థులను ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దుతానని చెప్పారు.

ఈ ఏడాది అంశం

'విద్యార్థులు చదువు, భవిష్యత్తును తీర్చిదిద్దుకునేలా బాధ్యత ఇద్దాం.. వారిలో శక్తిసామర్థ్యాలను వెలికితీసి నాయకులుగా, ఆవిష్కర్తలుగా ఎదిగేలా ప్రోత్సహిద్దాం..

"జీవితంలో కష్టాలను ఎదుర్కొన్నప్పుడే విజయాలను ఆస్వాదించగలం"

వైకల్యాన్ని ఎదిరించి..



వరంగల్ జిల్లా కల్లెడకు చెందిన జీవాంజి దీప్తి పారాలింపిక్స్ కాంస్య పతక విజేత.. తనది నిరుపేద కుటుంబం.. పుట్టుకతోనే మానసిక వైకల్యం.. జీవితంలో ఎన్నో కష్టాలు ఎదురవుతున్నా.. తల్లిదండ్రుల ప్రోత్సాహం, వ్యాయామ ఉపాధ్యాయులు, అథ్లెటిక్స్ కోచ్ శిక్షణలో విజేతగా నిలిచారు. లక్ష్యసాధనలో అడ్డంకులను పరుగుతో ఛేదించారు. అంకితభావంతో డిగ్రీ పూర్తి చేసి ఈ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

'కల అంటే మీరు నిద్రపోతున్నప్పుడే చూసేది కాదు.. అది మిమ్మల్ని నిద్రపోనివ్వదు'

పేదరికం అడ్డుకాలేదు



పాఠశాల స్థాయిలో గురువు మొగిలి స్ఫూర్తితో తానూ ఉపాధ్యాయ వృత్తిలోకి రావాలని.. కలలు గని పట్టుదలతో చదివి ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరబోతున్నారు.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లికి చెందిన పల్లకొండ శిల్ప.. నిరుపేద కుటుంబానికి చెందిన రవి, భాగ్యల కూతురు.. ఊరిలో సొంతిల్లు కూడా లేదు. చదువుకు పేదరికం అడ్డుకాదని, ప్రభుత్వ బడుల్లో చదువుకుని గురువు సూచనలతో ఇంటర్ తర్వాత టీటీసీ చదివి ఇప్పుడు ప్రభుత్వ ఉపాధ్యాయురాలైంది.

'సైన్స్ అనేది మానవాళికి ఒక అందమైన బహుమతి.. మనం దాన్ని వక్రీకరించకూడదు'

ఆవిష్కరణలు అదుర్స్



మహబూబాబాద్ మండలం కంబాలపల్లికి చెందిన షణ్ముఖరావు చదువుకున్నది పదో తరగతే.. కానీ, గొప్ప ఆవిష్కర్త.. పత్తి, మిర్చిలో కలుపు మొక్కలను తొలగించడానికి యంత్రాన్ని తయారు చేయాలనే ఆలోచనతో 2019లో 'మోనోవీల్ మ్యాన్‌రైడింగ్ పవర్ వీడర్'ను తయారు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం పొందారు. ఇప్పటివరకు ప్రజలకు ఉపయోగపడే ఎనిమిది రకాల ఆవిష్కరణలు తయారు చేశారు.

ఉమ్మడి జిల్లాలోని విద్యార్థుల వివరాలు	
పాఠశాలల విద్యార్థులు	4,63,500
జూనియర్ కళాశాలల్లో	1,03,100
డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీలో	1,19,000
పీజీ విద్యార్థులు	11,600

లిల్లీ తోట.. లాభాల బాట

ఆదర్శం

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం పటేలు గూడెం గ్రామానికి చెందిన పెండ్లి ప్రభాకర్ పూల తోటల సాగులో ఆదర్శంగా నిలుస్తున్నారు. బీఈడీ పూర్తి చేసినా.. వ్యవసాయం వైపే మొగ్గు చూపారు. తల్లి దండ్రులు రమేశ్, అనసూయ చేయూతను అందిస్తుండగా 18 ఏళ్లుగా మల్లెతోట సాగు చేప ట్టారు. ఈ ఏడాది 15 గుంటల విస్తీర్ణంలో బంతిపూల సాగు, 30 గుంటల విస్తీ ర్ణంలో నేలసంపంగి(లిల్లీ పూల) సాగు చేశారు. పూలు కోతకు వచ్చి లాభాల బాట పట్టారు. ఈ సందర్భంగా 'రైతే రాజు'తో మాట్లాడారు. గత సంవత్సరం జులైలో నేలను గుల్లగా దుక్కి చేశారు. 4 ట్రాక్టర్ల పశువుల ఎరువు చల్లుకు న్నారు. అడుగు దూరం, అడుగు వెడల్పుతో బోదెలు చేసుకున్నారు. వికారాబాద్‌లో రైతు వద్ద నుంచి ఒక్కో బ్యాగ్ రూ.వెయ్యి చెల్లించి 20 బ్యాగుల నేలసంపంగి పూల దుంప(గడ్డ)లను కొనుగోలు చేశారు. వాటిని అడుగు దూరంలో నాటుకున్నారు. నెలకో సారి కంపోస్టు, మిశ్రమ ఎరువులు వేస్తున్నారు. రసం పీల్చే పురుగు నివారణకు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ఆరు నెలల్లో పూత ప్రారంభమైంది. ఒక్కసారి నాటితే వర సగా మూడేళ్ల పూలు పూస్తుంటాయి. పూలను ఉదయమే కోయాల్సి ఉంటుంది. హైదరాబాద్ వంటి మార్కెట్‌కు తరలించాలంటే మరింత వేకువజామున పూలు కోస్తున్నారు. వ్రతాలు, పండగలు, పెళ్లిళ్ల సీజ న్‌లో కిలో రూ.150 వరకు సాధారణంగా కిలో.రూ.120 వరకు ధర లభిస్తుంది. రోజుకు 20 నుంచి 30 కిలోల దిగుబడి వస్తుంది. 6 నెలల్లోనే పెట్టిన పెట్టుబడులు సాధించారు. రోజుకు రూ.1500 వరకు ఆదాయం లభిస్తుంది. పెట్టుబడులు పోగా ఏటా రూ.5 లక్షల వరకు ఆదాయం ఉంటుంది. ఇద్దరు కూలీలు సరిపోతున్నారు. తక్కువ విస్తీర్ణంలో నేలసంపంగి సాగు చేపట్టి ఎక్కువ లాభాలు పొందుతున్నారు.



నేల సంపంగి పూలు చూపుతున్న పెండ్లి ప్రభాకర్

ఆశయం ఘనం.. ఆచరణలో విఫలం!

జనగామ, న్యూస్‌టుడే: పర్యావరణానికి మేలు చేయడంతో పాటు, పట్టణ పేద మహిళ లకు ఉపాధి మార్గం చూపించే ఆశయంతో ప్రారంభించిన ఓ పథకం మూలకు చేరింది. పట్టణ మహిళల ఆర్థిక ప్రగతికి మెప్మా ఆధ్వ ర్యంలో వారి సొంత, కొత్త వ్యాపారాలకు రుణా లిస్తున్నారు. ఇటు ఆదాయం, అటు పర్యావరణా నికి హితంగా ఉండేలా ప్రారంభించిన 'స్టీల్ బ్యాంకు' పథకం ఉమ్మడి జిల్లాలో ఆచరణలో విఫలమైంది. పట్టణ ప్రాంతాలకు సమస్యగా

ఇలా ప్రారంభమైంది..

మహాత్మా గాంధీ జాతీయ నిధి(ఎంజీఎన్ ఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్రంలో పురపాలికలున్న జిల్లా కేంద్రాల్లో స్టీలు సామగ్రి(స్టీల్ బర్తన్) బ్యాంకులను ఏర్పాటు చేశారు. మొదటి దశలో రూ.1.50 లక్షల నుంచి రూ.1.75 లక్షల వరకు పెట్టుబడిని రుణ రూపేణ సమకూర్చారు.. ఇందులో భాగంగా గత సంవత్సరం జనగామ, మహబూబాబాద్ జిల్లా కేంద్రాల్లోని పురపాలికల్లో ఒక్కొక్కటి, వరంగల్, హనుమకొండ జిల్లాల పరి ధిలో మూడు బ్యాంకులను ప్రారంభించారు. నిర్వ హణకు ఆసక్తి కలిగిన మహిళా సంఘాలను ఎంపిక చేసి, తక్కువ వడ్డీకి రుణం మంజూరు చేశారు. వసతి సౌకర్యం కల్పించి, కేంద్రం ద్వారా అద్దె ప్రాతి పదికన పాత్రలను స్టీల్ బ్యాంకు ద్వారా అందజేసేలా కార్యాచరణ రూపొందించారు. దశలవారీగా టెంట్లు, కుర్చీలు, బల్లలు ఇతర సామగ్రిని సమకూర్చుకుని వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవచ్చునని సూచించారు.

మూతపడిన స్టీల్ బ్యాంకు పథకం

మారిన ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు నిషేధా జ్ఞలు విధించి జరిమానాలు వడ్డిస్తున్నారు. విందులు, ప్రత్యేక సందర్భాల్లో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వాడకం ద్వారా ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా పోగవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో ఉభయ తారకంగా ఉండేలా 'స్టీల్‌బ్యాంకు' పథకాన్ని ప్రవే శపెట్టారు. ప్లాస్టిక్ వస్తువుల స్థానంలోనే గతంలో మాదిరిగా స్టీలు, ఇండాలియం(అల్యూ మినియం) గిన్నెలు, కంచాలు, గ్లాసుల వినియో గాన్ని ప్రోత్సహించేందుకు దీనిని ప్రారంభిం చారు. ఈ పథకం ద్వారా ఒక వేడుకలో 8 కిలోల ప్లాస్టిక్ వాడకం తగ్గుతుందని పరిగనలోకి రావడంతో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సర్వే సంస్థల నుంచి ప్రశంసలు సైతం దక్కాయి.

సహకారం కొరవడి.. రుణం భారమై..

జనగామ పరిధిలో మహమ్మద్ స్లమ్‌లెవల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నర్మద, రజియాలు 17 రకాల వస్తువులతో స్టీల్ బ్యాంకును సెప్టెంబరు 2023లో ప్రారంభించారు. మున్సిపాలిటీ, ఇతర ప్రభుత్వ శాఖల నుంచి, మెప్మా సంఘాల నుంచి సహ కారం అందలేదు. రవాణా, కూలీలకు చెల్లింపులు భారమయ్యాయి. దీంతో ఒకటి రెండు వేడుకలకు మినహా స్టీల్ సామగ్రిని సరఫరా చేయలేకపోయారు. రుణ భారం మీదపడింది. జయశంకర్ భూపాలపల్లిలో కేంద్రాన్ని ప్రారంభించలేదు. మహబూబాబాద్‌లో కొన్నాళ్లపాటు నడిచినా ప్రస్తుతం మనుగడలో లేదు. వరంగల్ కార్పొరే షన్ పరిధిలో కాజీపేట బ్యాంకు సామగ్రిని క్యాంటీన్ నిర్వహణలో వాడుతున్నారు. మరో రెండు చోట్ల ఖాయిలా పడ్డాయి.



జనగామలో ఇలా..

- పట్టణ సమాఖ్య నుంచి, రూ.1.50 లక్షలు రుణం తీసుకుని కేంద్రాన్ని ఏర్పాటు చేశాము. ఆశించిన సహకారం లేదు. దీంతో నిర్వహణ భారమైంది. ఆదాయం లేకున్నా, నెలనెలా వడ్డీతో పాటు కిస్తీ చెల్లించాల్సి వస్తోంది. రుణం రద్దు చేసి ఆదుకోవాలని జనగామ స్టీల్‌బ్యాంకు నిర్వాహకురాలు నర్మద తెలిపారు.
- ఆశించిన మేర సులభతర సేవలకు అవ కాశం లేకపోవడం ఇబ్బందిగా మారింది. ఇతర జిల్లాల్లో మాదిరి ఇక్కడా నిరుపయోగంగా ఉన్న స్టీల్ బ్యాంకు సామగ్రిని మహిళా శక్తి క్యాంటీ న్‌కు సరఫరా చేసే అవకాశాన్ని కల్పించాలని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని జనగామ మెప్మా పీడీ హర్షవర్ధన్ వివరించారు.

డ్రోన్.. పిచికారీ అదిరెన్



కాకర్లపల్లిలో డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేస్తున్న అజయ్‌కుమార్‌గౌడ్

రేగొండ, న్యూస్‌టుడే: ఇటీవల చాలా మంది రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో పంటలను సాగు చేస్తు న్నారు. నిత్యం మిర్చి, పత్తి వంటి పంటలకు రోజు మార్చి రోజు పురుగు మందులు స్ప్రే చేస్తుంటారు. ఒకటి, రెండు ఎకరాలు పిచికారీ కోసం ఇద్దరు కూలీలు అవసరం ఉంటుంది. రైతుల కష్టాలకు చెక్ పెట్టేలా ఓ ప్రైవేటు కంపెనీ సాయంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి అజయ్ కుమార్‌గౌడ్ డ్రోన్ తీసుకొచ్చారు. తక్కువ ఖర్చు, అతి తక్కువ సమయంలో అన్ని రకాల పంటలపై స్ప్రే చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇది పని చేసే విధానాన్ని ఆయన 'రైతేరాజు'కు వివ రించారు. సుమారు రూ. 7 లక్షల నుంచి రూ.8 లక్షలతో డ్రోన్ కొనుగోలు చేశారు. బ్యాటరీలను ఒకసారి ఛార్జింగ్ చేస్తే సుమారు 3 ఎకరాల వరకు మందు పిచికారీ చేయవచ్చు. ట్యాంకులో సుమారు 12 లీటర్ల నీటిని, మందును నింపుకునే అవకాశం ఉంటుంది. ఒక్క ఎకరం సుమారు 4 నుంచి 5 నిమిషాల కాలవ్యవధిలో పిచి కారీ పూర్తవుతుంది. రోజుకు సుమారు 20 నుంచి 25 ఎక రాలకు మందును స్ప్రే చేయవచ్చు. సాధారణంగా రైతులు ఎకరానికి సుమారు 120 నుంచి 150 లీటర్ల నీటిని ఉప యోగిస్తారు. అదే డ్రోన్‌తో కేవలం 12 లీటర్ల నీరు, తక్కువ మోతాదులో పురుగు మందు కలిపితే చాలు. సాధారణ పద్ధతిలో ఇద్దరు కూలీల ఖర్చులు(రూ.1200 నుంచి రూ.1500), ఒక్క రోజుకు 2 నుంచి 3 ఎకరాలకు తైవాన్ పంపుతో పిచికారీ చేస్తారు. మందు ఎక్కడా నేలపై కాకుండా కేవలం పంట మొక్కలపై పడుతుంది. తక్కువ నీరు, తక్కువ సమయం, తక్కువ మందు, తక్కువ ఖర్చుతో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా పూత, పురుగు మందుల వినియోగం అవుతుందని యువకుడు అజయ్‌కుమార్ గౌడ్ వివరించారు. ప్రస్తుతం ఒక రోజుకు సుమారు రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు ఆదాయం వస్తుందని చెప్పారు.

ప్రశ్న- సమాధానం

? వరిలో అగ్గి తెగులు సోకింది. నివారణ చర్యలు తెలపండి. –న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం

– కె.తిరుపతిరెడ్డి, వంగర, భీమదేవరపల్లి

✔ ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రోథైయోలిన్ 1.5 మి.లీ లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ లేదా ట్రైసైక్లోజోల్, మ్యాంకోజెబ్ మిశ్రమ మందును 2.5 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

– డా.దిలీప్‌కుమార్, కోఆర్డినేటర్, వరంగల్ ఏరువాక కేంద్రం



మిరపలో.. జాగ్రత్తలు పాటిద్దాం..!

మానుకోట, న్యూస్‌టుడే : ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు ప్రాంతాల్లో మిరప తోట లకు వివిధ రకాల చీడపీడలు ఆశిస్తున్నాయి. ఈ తరుణంలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను మల్యాల కేవీకే కార్యక్రమ సమ న్వయకర్త డాక్టర్ మాలతి, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఈ.రాంబాబు తెలిపారు.

పైముడత: తామర పురుగులు ఆకుల అడుగు భాగంలో రసం పీల్చడంతో ఆకులు పైకి పడవ ఆకారంలో ముడు చుకుంటాయి. నివారణకు ఒక లీటరు నీటికి ఫిప్రోనిల్ రెండు మి.లీ లేదా డయాఫెంథియురాన్ ఒకటిన్నర గ్రాములు లేదా ఎసిఫేట్ ఒకటిన్నర గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

వేరుకుళ్లు: మొక్కల వేర్లు నల్లబారి మొక్కలు చనిపోతాయి. మొదళ్లలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30గ్రాములు+ప్లాంటోమైసిన్ ఒక గ్రాము 10 లీటర్ల నీటికి లేదా లీటరు నీటికి కాపర్ హైడ్రాక్సైడ్ రెండు గ్రాములు లేదా మెటలాక్సిల్ రెండున్నర గ్రాములు కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు మొక్కల వేర్లు బాగా తడిసేలా పోసు కోవాలి. ట్రైకోడెర్మా విరిడి రెండు కిలోలు+ 90 కిలోలు బాగా చితికిన పశువుల ఎరువుతో కలిపి వారం పది రోజుల పాటు బాగా మగ్గిన తర్వాత తెల్లని బూజు ఏర్పడుతుంది. ఆ మిశ్రమాన్ని మొక్కల మొదళ్లలో వేసుకోవాలి.

● **ఆకుముడత :** ఇది ఆశించిన మొక్కల ఆకులు కుచించుకు పోయి గిడసబారి మొక్క ఎదుగుదల క్షీణి స్తుంది. తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందు తుంది. జిగురు అట్టలు ఎకరాకు 30 నుంచి 40 వేసుకోవాలి. వేపనూనె (1500 పీపీఎం) ఐదు మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. తెల్లదోమల నివార ణకు లీటరు నీటికి ఎసిఫేట్ ఒకటిన్నర గ్రాములు లేదా థయోమిథాక్సాం 0.3 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లేదా క్లోరోఫిన్‌ఫైర్ రెండు మి.లీ వంటి మందులను మారుస్తూ పిచికారీ చేయాలి.

● **నల్లతామర :** ఆకుల చిగుర్లు ఎరుపు వర్ణంలోకి మారి మాడిపోయినట్లు కనిపి స్తాయి. నివారణకు జిగురు అట్టలు ఎక రాకు 20 నుంచి 30 ఏర్పాటు చేయాలి. ఫిప్రోనిల్ 80 శాతం 40 గ్రాములు ఎక రాకు లేదా ఫిప్రోనిల్+ ఇమిడాక్లోప్రిడ్ 40 గ్రాములు ఎకరాకు, లేదా సయాంట్రనిలి ప్రోల్ 90-100 మి.లీ ఎకరాకు లేదా స్పైన టోరమ్ 180 మి.లీ ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



నల్లతామర పురుగులు

విదేశానికి వెళ్లే భాగ్యం లేదా?

అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఎంపికైన దివ్యాంగురాలు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: పుట్టు కతో ఒంటి కాలుతో వచ్చిన వైకల్యంతో ఆమె కుంగిపోలేదు.. ఇరుగుపొరుగువారి సూటి పోటి మాటలే ఆమెలో పట్టుదలను పెంచాయి.. ఏదైనా సాధించాలనే తపన పెంచాయి. అమ్మమ్మ ఇంటివద్ద ఉంటూ చదువుకొంది.. ఏడో తరగతిలో ఉన్నప్పుడు పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్స వాన్ని నిర్వహించారు. అప్పుడే ఆమె దృష్టి క్రీడల వైపు మళ్లించి ప్రతిభ చాటుతోంది. అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీలకు దివ్యాంగుల విభాగంలో ఎంపికై దాతల ఆర్థిక సహకారం ఎదురుచూస్తోంది.

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గొల్లగూడెనికి చెందిన దయ్యాల కొమరమ్మ-కొమరయ్యల కూతురు భాగ్య తన కున్న వైకల్యాన్ని లెక్కచేయకుండా ట్రై సైక్లింగ్, షాట్‌పుట్, చెస్, క్యారమ్స్ పోటీల్లో పాల్గొంటోంది. సీనియర్ క్రీడాకారుడు ప్రశాంత్ అందించిన సహకారంతో దివ్యాంగుల విభాగంలో వివిధ క్రీడల్లో పాల్గొని రాష్ట్రస్థా యిలో రాణిస్తోంది. ఈ ఏడాది డిసెంబర్ 1 నుంచి 5 వ తేదీ వరకు ఇండోనేషియాలో నిర్వహించనున్న అంతర్జా తీయ 'పారా త్రోబాల్ పోటీల్లో పాల్గొనేందుకు దివ్యాం గుల విభాగంలో ఎంపికైంది. పారా త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఆర్) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21 నుంచి 24 వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ పోటీల్లో పాల్గొని అంతర్జాతీయ పోటీ లకు ఎంపికైన క్రీడాకారుల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ఆమెకు అవకాశం లభించింది. విదేశా లకు వెళ్లేందుకు అయ్యే సుమారు రూ. 90 వేలు వ్యయం భరించే ఆర్థిక స్థోమత లేక ఆవే దన చెందుతోంది. 2019లో కూడా ఆమె థాయి లాండ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పారా ఒలింపిక్ పోటీలకు ఆర్థిక స్థోమత లేక వెళ్లలేక పోయింది. మరోసారి అవకాశం వచ్చినా ఆమెకు లక్ష్మీ కటాక్షం కరవైంది. ఈసారి ఎలా గైన ఇండినేషియాలో నిర్వహించే పోటీల్లో పాల్గొనాలనే ఆశతో తనకు ఆర్థిక సహకారం అందించాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో విన్నవిం చారు. జిల్లా క్రీడలు, యువజన శాఖలో బడ్జెట్ లేకపో వడంతో తాము ఆర్థికంగా చేయూతను అందించలేమని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని అధికారులు బదులిచ్చారు. మొదటి విడతగా రూ. 35 వేలు మంగ ళవారం వరకు, మిగిలిన సొమ్ము నవంబర్ నెల 15 వరకు సమకూరుతేనే వీసా, వసతి సౌకర్యాలు కలుగుతా యని చెబుతూ దాతల సహకారాన్ని ఆశిస్తోంది.



డి. భాగ్య

16, 17న క్రికెట్ ఎంపిక పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అండర్-23 విభాగంలో ఈ నెల 16, 17 తేదీల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ మండిబ జార్‌లో జరిగిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. దేశా యిపేట సీకేఎం కళాశాల మైదానంలో పోటీలు ఉంటా యన్నారు. వరంగల్, హనుమ కొండ, ములుగు, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లా జట్లకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆరు జిల్లాల క్రికెటర్ల ప్రతిభ ఆధా రంగా ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక చేస్తామన్నారు. ఎంపి కైన జట్టు ఈ నెల 20 నుంచి 23వరకు వరంగల్ నగరంలో జరిగే ఇంట్రా డిస్ట్రిక్(ఉమ్మడి జిల్లాలు) క్రికెట్ టోర్నీలో పాల్గొంటారని వివరించారు.

చికెన్ ధరలు (కిలో వెల రూపాయలలో) వెన్‌కాబ్		
ఫాం: 126	డ్రెస్డ్: 215
రిటైల్: 148	స్కిన్‌లెస్: 244

నేటి నుంచి వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిబిరం



రామప్ప ఆలయం

వెంకటాపూర్(ములుగు జిల్లా), న్యూస్‌టుడే: యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఖ్యాతిని ప్రపంచ నలుమూలలా చాటిచెప్పేందుకు ఏటా నిర్వహించే వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరం-3 మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. యునెస్కో, కేంద్రపురావస్తు, పర్యాటక శాఖలు, ఇంటాక్ భాగస్వామ్యంతో ఈనెల 15 నుంచి 26 వరకు 80 మంది వాలంటీర్లకు శిక్షణ ఇచ్చేందుకు శ్రీకారం చుట్టారు. గుర్తింపు తర్వాత నిర్వహించే మూడో శిబిరంలో రాష్ట్రంలోని టూరిజం క్లబ్‌లకు కూడా ఈ ఏడాది కొత్తగా అవకాశం కల్పించారు. ఏటా డబ్ల్యూహెచ్‌సీ(వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిబిరం) నుంచి ఎంపికైన వారికి మాత్రమే తర్ఫీదు ఇచ్చేది. దాంతో ప్రపంచస్థాయి లోనే కాకుండా స్థానికంగా కూడా రామప్ప కీర్తిని మరింత చాటేం దుకు అడుగులు పడ్డాయి. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. జిల్లా పాలనాధికారి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 12 రోజుల పాటు వివిధ శాఖల్లో ప్రావీణ్యం కలిగిన ప్రొఫెసర్లతో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు.

మే నుంచే దరఖాస్తుల స్వీకరణ : ఈ శిబిరం నిర్వహణకు యునెస్కో మే 2024లోనే ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు ప్రక టన వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా స్వదే శీయులతో కలిపి 253 మంది www.unesco.whc.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 45 మంది విదేశీయులు ఎంపికయ్యారు. కొన్ని కారణా లతో ఈసారి విదేశీయులెవ్వరూ శిబిరానికి హాజరుకావడం లేదని, ప్రస్తుతం మన దేశం లోని కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 40 మందిని ఎంపిక చేసినట్లు ఇంటాక్ ప్రతి నిధి శ్రీధర్‌రావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. వీరిలో 18 నుంచి 35 ఏళ్లలోపున్న చరిత్ర, కళలు, పురావస్తు, ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజినీరు, టూరిజం విభాగాల్లో నైపుణ్యం కలిగిన విద్యార్థులున్నారు.

యువ టూరిజం నుంచి 40 మంది : రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల ప్రాశస్త్యాన్ని మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన టూరిజం క్లబ్‌ల నుంచి రామప్పలో నిర్వహించే ఈ శిబిరానికి ప్రత్యేకంగా యువటూరిజం(ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి) 40 మందిని ఎంపిక చేసింది. రామప్ప ఖ్యాతిని తెలుసుకు నేలా రాష్ట్రం నుంచి కూడా చోటు కల్పించాలని యునెస్కోను కోర డంతో స్థానికులకు అవకాశమిచ్చినట్లు పర్యాటకశాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పర్యాటకం, చరిత్ర విద్యనభ్యసిస్తున్న వారే అధికంగా ఉండటం గమనార్హం.

కిక్కిరిసిన బస్సులు..!

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే: బతుకమ్మ, దసరా వేడుకలు ముగిశాక సొంతూళ్ల నుంచి వారి గమ్యస్థానాలకు బయలుదేరడంతో హనుమకొండ బస్టాండు సోమవారం ప్రయాణికులతో కిటకిటలా డింది. ప్రయాణికులు బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణిం చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 850 ప్రత్యేక బస్సు లను నడిపించినా.. ఆది, సోమవారాల్లో ప్రయాణ ప్రాంగణాలు నిండిపోయాయి. హైదరాబాద్ వెళ్లే వారి సంఖ్య భారీగా ఉంది. రద్దీని గమనించిన ఆర్టీసీ అధికారులు బస్టాండులోనే ఉంటూ పర్యవేక్షిస్తూ ప్రత్యేక బస్సులను నడిపించారు. సోమవారం రాత్రి వరకు రద్దీ కొనసాగింది. హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్టణం, గుంటూరు, విజయ వాడ, మచిలీపట్టణం, నిజామాబాద్, కరీంనగర్ తది తర ప్రాంతాలకు ఎక్కువగా నడిశాయి. ఉమ్మడి జిల్లాకు హనుమకొండ బస్టాండు ప్రధాన కేంద్రం కావడంతో ఇక్కడే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా కని పించింది. ఆర్టీసీ డీఆర్ఎం భానుకిరణ్, వరంగల్ 1, వరంగల్ 2 డిపోల మేనేజర్లు మోహన్‌రావు, జ్యోత్స్న తదితరులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. తగిన విధంగా సేవలందించారు. బస్సులన్నీ రద్దీ మార్గా లకు పంపించడంతో జిల్లాలో రోజువారీ నడిచే బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.



బస్సు ఎక్కేందుకు పోటీ పడుతూ..



హనుమకొండ బస్టాండులో ప్రయాణికుల రద్దీ

తెరుచుకోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ బాధ్యులు

విద్యానగర్, న్యూస్‌టుడే: బోధన రుసుం విడుదల కోరుతూ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు సోమవారం బంద్ పాటించాయి. దీంతో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధి లోని సుమారు 180 ప్రైవేటు కళాశాలలు మూతపడ్డాయి. దసరా సెలవుల తరువాత నిరవధికంగా బంద్ పాటిస్తామని ఇటీవల కేయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించారు. సోమ వారం కళాశాలల బంద్ చేస్తూ హనుమకొండ వాగ్దేవి డిగ్రీ, కళాశాల ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కళాశాల లను బంద్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదివారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి హెచ్చరించినా, యాజ మాన్యాలు పట్టించుకోలేదు. కళాశాలల అసోసియేషన్ అధ్య క్షుడు పి.ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ సుమారు రూ.300 కోట్లు బోధన రుసుం బకాయిలు రాక నిర్వహణ భారమైనందునే విధి లేక మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వెంటనే బోధన రుసుం బకాయిలు చెల్లించి విద్యార్థులకు, కళాశాలల యాజమాన్యాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ బాధ్యులు ప్రభాకర్ రెడ్డి, వేణుమాధవ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తేలని విద్యార్థుల లెక్క

భూపాలపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఒకటి నుంచి ఇంటర్మీడి యట్ వరకు విద్యార్థుల సంఖ్య కోసం 2012-13లో యూడైస్ పోర్టల్ (ఏకీ కృత జిల్లా విద్యా సమాచారం) ప్రవే శపెట్టింది. దీనిని రెండేళ్ల కిందట యూడైస్ ప్లస్‌గా మార్చారు. అయితే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యా ర్థుల సంఖ్య తేల్చ లేక విద్యాశాఖ అధికారులు తల పట్టుకుంటున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రవేశాల గడువు ముగిసినా ఇంత వరకు తుది జాబితా కొలిక్కిరాలేదు. అయితే పిల్లలు రోజూ పాఠశాలలకు వస్తు న్నారా.. వేరే గ్రామాలు, పట్టణాలకు వలస వెళ్లారా.. తదితర ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు. రెండేళ్ల క్రితం నుంచి యూడైస్ ప్లస్ ద్వారా విద్యార్థుల సమగ్ర సమాచారం పొందుపరుస్తున్నారు. ఉమ్మడి వరం గల్ జిల్లాలో ఇప్పటి వరకు 50,463 మంది విద్యార్థుల సమాచారం లేదు.

మౌలిక వసతుల కల్పనకు..

బడి ఈడు పిల్లలు చదువు తున్నారా లేక బడి బయట ఉన్నారా.. తదితర విషయా లను యూడైస్ ప్లస్ నివేదిక తెలియజేస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఈ నివేదిక కొల మానం కానుంది. అదే విధంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు సంబంధించిన ఆధార్ నంబరు అనుసంధాని స్తున్నారు. దీంతో ఒక విద్యార్థి పేరు రెండు చోట్ల ఉండే అవకాశం లేదు. వివ రాలు నమోదు చేయడంలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమా న్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నాయి. పోర్టల్‌లో నమోదు కాని విద్యార్థుల వివ రాలపై ఉన్నతాధికారులు ఆదే శించినా ఫలితం లేదు.

సాంకేతిక సమస్య కారణం..

పాఠశాలల్లో బోగస్ సంఖ్య తప్పించుకునేందుకు కొత్త ఎత్తుగడ వేస్తున్నారు. కొందరికి ఆధార్ కార్డు పొందడం కోసం వేలిముద్రలు పడటం లేదని, మరికొందరు ఉపాధి కోసం వలస వెళ్లి మళ్లీ ఇక్కడే చదువుతున్నారని, ఆధార్ నవీకరణలో సాంకేతిక సమస్యలు ఉన్నాయని, ఇలా వివిధ కారణాలు చెబుతున్నారు. కొన్ని చోట్ల నెలల తరబడి పిల్లలు హాజరు కాకున్నా వారి రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. పిల్లల సంఖ్య తగ్గితే అక్కడ నుంచి బదిలీ లేదా డిప్యుటేషన్‌పై వేరే ప్రాంతానికి పంపిస్తారనే ఆరోపణలు సైతం వ్యక్తమవుతున్నాయి. విద్యాశాఖ అధికా రులు దృష్టి సారిస్తే బోగస్ సంఖ్య తేలనుంది. పాఠశాలల్లో చేరిన ప్రతి విద్యార్థికి శాశ్వత విద్యా సంఖ్య (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్) కేటాయించి పోర్టల్‌లో నమోదు చేస్తారు. శాశ్వత సంఖ్య ఆధారంగా ప్రవేశం కల్పిస్తే ఎక్కడ చదువుతున్నారో తెలుస్తుంది.



తరగతి గదిలో విద్యార్థులు

ప్రధానోపాధ్యాయులను ఆదేశించాం

- రాజగోపాల్, విద్యాశాఖ జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్

ప్రతి విద్యార్థి పేరుతో పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం. జిల్లాలో డ్రాప్ బాక్స్‌లో ఉన్న వివరా లను తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. తమ పరిధిలోని సంఖ్య తేల్చాలని ఇప్ప టికే అన్ని పాఠశాలల హెచ్‌ఎంలను ఆదేశి స్తున్నాం. నిర్లక్ష్యం చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యంగా ప్రధానోపాధ్యాయులు స్పందించి లెక్కలు తేల్చాలి.

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సేకరించాల్సిన పిల్లల సంఖ్య

భూపాలపల్లి	ములుగు	వరంగల్
4,009	3,228	12,547
జనగామ	హనుమకొండ	మహబూబాబాద్
6,368	15,415	9,028

విదేశాల్లో ఉద్యోగాలకు నమోదు చేసుకోండి

కొత్తవాడ, న్యూస్‌టుడే: విదేశాల్లో ఉద్యో గాల కోసం నమోదు(ఎన్‌రోల్‌మెంట్) ప్రక్రియ చేపడుతున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఉమారాణి తెలి పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్), రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ సహకారంతో జర్మనీలో వివిధ ఉద్యోగావకా శాలు ఉన్నాయన్నారు. ఈ నెల 17న ములుగురోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నమోదు కార్య క్రమం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 94400 52592 సంప్రదించాలన్నారు.

రూ.10 నాణెం చెల్లుబాటు

కాజీపేట : రిజర్వ్ బ్యాంకు ఉత్తర్వుల ప్రకారం రూ.10 నాణెం చెల్లు బాటు అవుతుందని కెనరా బ్యాంకు ఒక ప్రకటనలో తెలిపింది. నాణెం చెల్లుబాటుపై విస్తృత ప్రచారం జరగాలని సూచించింది. నాణేల స్వీక రణలో విముఖత చూపిస్తున్న వారి అనుమానాలను నివృత్తి చేసి వినియోగంలోకి తెచ్చేలా చూడాలని పేర్కొంది.

రైలు నుంచి పడి ప్రయాణికుడి దుర్మరణం

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు ప్రయాణికుడు రైలు నుంచి కింద పడి మృతి చెందాడు. ఈ సంఘటన రఘునాథపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. జనగామ రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి (40) సోమవారం గుర్తు తెలియని రైలు నుంచి జారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సిబ్బంది రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో విచారణ చేపట్టారు. మృతుడి కుడి చేతిపై 'నాన్న' అని పచ్చబొట్టు ఉంది. అతని వద్ద ఎలాంటి వివరాలు లభించలేదు. మృతదేహాన్ని జనగామ ప్రాంతీయ ఆసుపత్రి పోస్టుమార్టం గదిలో భద్రపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 9440027342 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని రైల్వే హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేశ్ కోరారు.

దృష్టి మరల్చి.. నగదు అపహరించి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి, తదితరులు

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై నగదుతో వెళ్తున్న ఒకరి దృష్టి మరలించిన ఇద్దరు దుండగులు రూ.40వేలు ఎత్తుకెళ్లిన సంఘటన సోమవారం సాయంత్రం దేవరుప్పుల మండలం సీతారాంపురం బస్టాండ్ శివారులో జరిగింది. సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చెన్నకేశవులు తెలిపిన ప్రకారం.. రంభోజీగూడానికి చెందిన పైండ్ల మల్లయ్య సింగరాజుపల్లిలోని ఏపీజీవీ బ్యాంక్ నుంచి రూ.40వేలు డ్రా చేసి తన వాహనంపై ఇంటికి బయల్దేరాడు. సీతారాంపురం సమీపంలోని దుర్గమ్మ గుడి వద్ద ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు కింద పడిపోయాయని చెప్పగా, మల్లయ్య వాటిని తీసుకునే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో మల్లయ్య వాహనంలో ఉన్న రూ.40వేలను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విధులకు ఆటంకం కల్గించారని రిమాండ్

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: పోలీసుల విధులకు ఆటంకం కలిగించి దుర్భాషలాడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెన్నకేశవులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి సింగరాజుపల్లికి చెందిన ఓ మహిళ పోలీసుల సహాయం కోసం 100కు ఫోన్ చేసింది. సంఘటన స్థలానికి చేరుకున్న కానిస్టేబుల్ మసూద్ చుట్టు పక్కల నుంచి వివరాల సేకరిస్తుండగా ఇదే గ్రామానికి చెందిన మేడ నాగేష్ అడ్డుకుని వాగ్వాదానికి దిగాడు. కానిస్టేబుల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

జనగామ రూరల్, న్యూస్‌టుడే: జనగామ-హుస్నాబాద్ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన జనగామ మండలం గానుగుపహాడ్ శివారు కొత్రతండా వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తరిగొప్పులకు చెందిన భిక్షపతి అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై జనగామకు వెళుతున్నాడు. అదే క్రమంలో జనగామ వైపు వెళుతున్న ట్రాక్టర్‌ను భిక్షపతి ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు జిల్లా ఏరియాసుపత్రికి, అక్కడి నుంచి వరంగల్‌కు తరలించారు.

రహదారి గుంతలమయం..!

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: జనగామ నుంచి నెల్లుట్ల, లింగాలఘనపురం, బండ్లగూడెం, గుమ్మడవెల్లి మీదుగా జీడికల్ వెళ్లే రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. బండ్లగూడెం దేవాదుల కాల్వ వద్ద, గుమ్మడవెల్లి సమీపంలోని దేవాదుల కాల్వ దగ్గర, జీడికల్ వీరాచల రామచంద్ర స్వామి ఆలయం ఎదుట తారు రోడ్డుపై, తాత్కాలిక రోడ్డుపై ఇదే పరిస్థితి నెలకొంది. భారీ గుంతలతో ప్రమాదాలు జరగుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



జీడికల్ దేవాలయం సమీపంలో..



బండ్లగూడెం వద్ద..

మేమున్నాం.. మీకు తోడుగా

జనగామ: 80085 74872
జనగామ అర్బన్: 80749 20132
పాలకుర్తి: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: మండలంలోని తమ్మడపల్లి(జి)లో కల్వర్టు కోతకు గురైంది. ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి. మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూడాలి. **- రామస్వామి, తమ్మడపల్లి(జి)**

సమాధానం: కల్వర్టును పరిశీలించి మరమ్మతులు చేపడతాం. **- సుమన్, ఎంపీడీవో, జఫర్‌గఢ్**

● జఫర్‌గఢ్ శివారు వడ్డెగూడెంలో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వ్యాపిస్తున్నాయి. **- రాంబాబు, వడ్డెగూడెం**

సమాధానం: పంచాయతీ సిబ్బందికి ఆదేశాలు జారీ కాల్వలను శుభ్రం చేయిస్తాం. **- రాజేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి, జఫర్‌గఢ్**

మురుగుకాల్వలు శుభ్రం

స్పందనకు వందనం

పాలకుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని గౌడకాలనీలో మురుగు కాల్వలు అపరిశుభ్రంగా ఉండటంతో కిరణ్ అనే వ్యక్తి 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరచారి స్పందించి, సిబ్బందితో పేరుకుపోయిన చెత్తచెదారం, పూడికమట్టి తొలగించారు.

నేడు డీఎస్సీ విజేతలకు కౌన్సెలింగ్

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 ద్వారా నియామకమైన నూతన ఉపాధ్యాయులకు నేడు(మంగళవారం) కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోస్టింగ్(పాఠశాలల కేటాయింపు) కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.రాము సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒరిజినల్ నియామకపత్రంతో హాజరు కావాలని, మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలను పోస్టింగ్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఉదయం 9.30గంటలలోపు హాజరు కావాలని, ఎస్జీటీలు మధ్యాహ్నం 12గంటల వరకు హాజరు కావాలని పేర్కొన్నారు.

పురాతన గణేశుడి శిల్పం లభ్యం



శిల్పాన్ని చూపుతున్న పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి

జనగామ రూరల్, న్యూస్‌టుడే: తొమ్మిదో శతాబ్దం నాటి వినాయకుడి శిల్పం వెలుగు చూసిన సంఘటన జనగామ మండలం పెద్దరామన్‌చర్లలో సోమవారం వెలుగు చూసింది. పురావస్తు పరిశోధకులు రెడ్డి రత్నాకర్‌రెడ్డి, డాక్టర్ మునిరత్నం(ఎపిగ్రఫీ) సహాయంతో పెద్దరామన్‌చర్లలోని రాములోరి గుట్ట వెనుక భాగంలో కన్నడ భాష శాసనంతో కూడిన వినాయకుడి శిల్పాన్ని గుర్తించామని వారు తెలిపారు. శాసనంలో రెండు పేర్లు శ్రీ సాంబేయ సంసారం, భీతం మడిసిడమ్ పేర్లు ఉండగా శిల్పాన్ని సాంబయ్య అనే వ్యక్తి చెక్కించారని పేర్కొని ఉందన్నారు. జనగామలో ఇప్పటికే 50కి పైగా శాసనాలు వెలుగు చూశాయని, వీటిని పరిశీలిస్తే జిల్లా చరిత్ర సంపూర్ణంగా వెల్లడవుతుందని రత్నాకర్‌రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి స్వాగతిస్తున్న మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: కార్మిక, కర్షక సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తున్న సీపీఐని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి అన్నారు. మండలంలోని కంచనపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ పార్టీల నాయకులు సీపీఐలో చేరగా కండువా కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయాల్లో కేంద్ర, రాష్ట్ర పాలక వర్గాల మోసపూరిత హామీలు ఇచ్చి విస్మరించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, మండల కార్యదర్శి కావటి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



తమ్మడపల్లిలో ప్రారంభిస్తున్న రాజేందర్‌రెడ్డి

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని, నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని జిల్లా సహకార అధికారి రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం బచ్చన్నపేట మండలంలోని తమ్మడపల్లిలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ వేణుగోపాల్, పీఏసీఎస్ ఛైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, డైరెక్టర్ బేజాడి సిద్ధులు, సీఈవో బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం



రఘునాథపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల కలెక్టర్ నుంచి అవార్డు పొందిన ఫత్తేషాపురం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను సోమవారం గ్రామ నాయకులు సన్మానించారు. కార్మికులు గడ్డం గట్టయ్య, చింత సమ్మయ్య, ఉప్పోజు దామోదర్, గడ్డం ఎల్లమ్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రఘుపతి, కొంరెల్లి, చింత మహేశ్, తూడి ప్రసాద్, గడ్డం నవీన్, నామాల నాగరాజు, ఉప్పలయ్య గౌడ్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



కట్టపై రావణవధ వద్ద..

పండగ ముగిసినా.. పారిశుద్ధ్యం పట్టదా?..

జనగామ పట్టణంలోని బతుకమ్మకుంట మైదానంలో బతుకమ్మ, దసరా ఉత్సవాలు వైభవంగా ముగిసాయి. ఉత్సవాలు ముగిసినా కూడా కుంట కట్టపై కాల్చిన బాణసంచా, కటౌట్లు ఇంకా తొలగించకపోవడంతో వాకర్లకు ఇబ్బందిగా మారింది. మున్సిపల్ అధికారులు పట్టించుకొని పారిశుద్ధ్యంపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, జనగామ టౌన్

ఆహ్లాదభరితం.. ఆనందకరం

రహదారులకు ఇరువైపులా నాటిన హరితహారం మొక్కలు ఏపుగా పెరిగి వాహనదారులకు నీడనివ్వడంతో పాటు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఆహ్లాదకరంగా ఉన్నాయని పలువురు ప్రయాణికులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. బచ్చన్నపేట మండలంలోని బసిరెడ్డిపల్లి-కొడవటూర్ గ్రామాలకు వెళ్లే మార్గాల్లో ఈ దృశ్యం కనిపించింది. – న్యూస్‌టుడే, బచ్చన్నపేట



స్తంభం మరిచి రోడ్డు వేసే..



చిత్రంలో కనిపిస్తున్న విద్యుత్తు స్తంభం నెల్లుట్ల గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉంది. విద్యుత్తు శాఖ అధికారులు స్తంభాన్ని తొలగించకుండా సీసీ రోడ్డు వేయించారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్తంభాన్ని పక్కకు నాటించాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, లింగాలఘనపురం

జిల్లా సంక్షేమ అధికారిణిగా ఫ్లోరెన్స్



జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ జిల్లా సంక్షేమ శాఖ అధికారిణిగా స్టేషన్‌ఘన్‌పూర్ సీడీపీవోగా పని చేస్తున్న డి.ఫ్లోరెన్స్ పూర్తి స్థాయి అదనపు బాధ్యతలను సోమవారం చేపట్టారు. ఇక్కడ సంక్షేమ అధికారిణిగా పని చేసిన జయంతి అసిస్టెంట్ డైరెక్టర్ పదోన్నతి పొందుతూ హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారిణిగా బదిలీపై వెళ్లారు. నూతన అధికారిణి ఫ్లోరెన్స్‌ను కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.

పాఠశాలలకు సెలవు ప్రకటించాలని వినతి

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలో ఈ నెల 16, 17న జరిగే దుర్గామాత పండగను పురస్కరించుకొని స్థానికంగా ఉన్న విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలని కోరుతూ విద్యార్థి సంఘాల నేతలు సోమవారం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని అన్ని కులాలు, సామాజిక వర్గాలకు చెందిన వారందరూ సమిష్టిగా పండగను జరుపుకుంటున్నందున లోకల్ హాలిడేగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి ఐకాస జిల్లా ఛైర్మన్ పిట్టల సురేశ్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు చిలువేరు అభి గౌడ్, టీజేవీపీ జిల్లా అధ్యక్షుడు తుంగ కౌశిక్, దండు ఉపేందర్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు పూజ్యం.. ఇష్టారీతిన ఆకతాయిలు..

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ జిల్లా కేంద్రంలో గత కొన్ని నెలలుగా పోలీస్ బందోబస్తు విషయంలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అసలే జిల్లా కేంద్రంలో చోరీల బెడద తీవ్రం కావడం, అస్తవ్యస్థ ట్రాఫిక్ సమస్య, పని చేయని సీసీ కెమెరాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు దసరా పండగ సందర్భంగా పోలీసుల తనిఖీలు కూడా ఈ ఏడాది అంతగా లేదనే వ్యాఖ్యలు వినిపించాయి. దసరా తెల్లవారి ఆకతాయి యువత తాగడంతో పాటు ఇష్టారీతిన ద్విచక్రవాహనాలు, కార్లు నడుపుతూ ప్రమాదాల బారినపడ్డారు. గత కొన్నేళ్లుగా జనగామ పట్టణంలోని పలు ప్రధాన సెంటర్లు, పట్టణ శివారు రహదారులపై విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టేవారు. కానీ ఈ దసరా నేపథ్యంలో తనిఖీలు చేపట్టకపోవడంతో సాయంత్రం 7 గంటల నుంచి అర్ధరాత్రి వరకు అన్ని రహదారులపై ఇష్టారీతిన ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనల్లో అనేక మంది తీవ్ర గాయాలపాలైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. జిల్లా ఆసుపత్రిలో ఆదివారం సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి పది గంటల లోపే పలు ప్రమాదాల్లో గాయపడిన బాధితులు దాదాపుగా పదుల సంఖ్యలో రావడం గమనార్హం. గాయపడిన వారి తరపు కుటుంబ సభ్యులు కూడా పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై డీసీపీ రాజమహేంద్రనాయక్ మాట్లాడుతూ.. జనగామ పట్టణం, రూరల్ పరిధిలో విస్తృతంగా బందోబస్తు చేపట్టామన్నారు. గొడవలు జరిగిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సి వచ్చిందని వివరించారు.

శునకాలు, వానరాల నుంచి కాపాడండి మహాప్రభో..



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జనగామ జిల్లా వ్యాప్తంగా పిల్లలు, వృద్ధులపై దాడులకు పాల్పడుతున్న కోతులను, కుక్కలను నివారించి ప్రజల ప్రాణాలను రక్షించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతూ అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బి.గోపి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ మాట్లాడుతూ.. పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలకు రక్షణ కరవైందన్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టింపే లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కల్యాణం లింగం, చుంచు విజేందర్, అజారుద్దీన్, లలిత, శ్రావణ్, శ్రీకాంత్, కల్యాణి, ఉపేందర్ పాల్గొన్నారు.

పత్తి రైతుల కోసం వాట్సప్ నెంబరు



ఈనాడు, వరంగల్

పత్తి రైతుల కోసం మార్కెటింగ్ శాఖ ఈ ఏడాది ఒక వాట్సప్ నెంబరును (8897281111) అందుబాటులోకి తీసుకొచ్చింది. కొనుగోళ్ల ప్రారంభమైన నేపథ్యంలో ప్రవేశపెట్టిన ఈ వాట్సప్ విధానం వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయంటోంది. ఈ అప్లికేషన్ వల్ల అన్నదాతలు పత్తి పంటతో రోజుల తరబడి సీసీఐ కేంద్రాలున్న మిల్లుల వద్ద వేచి చూసే పని ఉండదు. ఏ కేంద్రం వద్ద ఎంత సరకు ఉంది, వేచి చూడాల్సిన సమయం ఎంతనేది కూడా ముందే తెలుస్తుంది. దీని వల్ల రైతులు తమ దగ్గర్లోని కేంద్రంలో ఎక్కడ వేచి చూసే సమయం తక్కువుందో అక్కడికి వెళ్లే విధంగా ఈ వాట్సప్ అప్లికేషన్ రూపొందించారు. పైన పేర్కొన్న మొబైల్ నెంబర్‌తో వాట్సప్‌లో రైతులు 'హెచ్‌ఐ' (హాయ్) అని టైప్ చేస్తే వెంటనే 'వన్ సాఫ్ట్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో అది తెరచుకుంటుంది. ఇందులో ఇంగ్లిష్, తెలుగు, హిందీ మూడు భాషల్లో కావాల్సిన దాన్ని ఎంపిక చేసుకోవచ్చు. ఉదాహరణకు తెలుగు ఎంపిక చేసుకుంటే 'అర్హత తనిఖీ', 'విక్రయ సమాచారం', 'తక్‌పట్టి వివరాలు', 'కేంద్రంలో వేచి ఉండే సమయం', ఇలా నాలుగు ఐచ్ఛికాలు కనిపిస్తాయి. రైతులు సాగు చేసిన పత్తి వివరాలు, రైతు ఎన్ని క్వింటాళ్ల వరకు విక్రయించుకునేందుకు అర్హత ఉందనేది మొదట కనిపిస్తుంది. ఒకవేళ రైతులు పత్తి విక్రయిస్తే ఎంత సరకు విక్రయించారు, చెల్లింపు డబ్బుల వివరాలు కనిపిస్తాయని మార్కెటింగ్ వర్గాలు తెలిపాయి.

సీహెచ్‌సీలో ఆరోగ్యమేళా



బచ్చన్నపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో సోమవారం ప్రత్యేక డాక్టర్లతో ఆరోగ్య మేళా కార్యక్రమం నిర్వహించారు. పిల్లల వైద్యులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ ఆదిలక్ష్మి, సృజన, డాక్టర్ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ ఆదేశాల మేరకు ప్రతీ నెల రెండో శనివారం ఆరోగ్యమేళా నిర్వహించాల్సి ఉండగా దసరా సందర్భంగా సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య బృందం పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీల్లో మైనార్టీలకు చోటుకు వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మైనార్టీ నాయకులు

జనగామ, న్యూస్‌టుడే: ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు సంబంధించి విడుదల చేసిన ప్రభుత్వ ఉత్తరువుల్లో మైనార్టీల ప్రస్తావన లేకపోవడం సబబు కాదని జనగామ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మసిఉర్ రహమాన్, భారాస మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు సలీం తెలిపారు. ఇంటింటి సర్వే జీవోలోను వివిధ వర్గాల స్థితి గతులపై సర్వే చేయాలని పేర్కొన్నారని, అందులోను మైనార్టీల ప్రస్తావన లేదన్నారు. ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి పోస్టు ద్వారా వినతిపత్రం పంపించినట్లు వారు పేర్కొన్నారు.

విజయ దుర్గామాత ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలోని బతుకమ్మకుంట మైదానంలో ఉన్న విజయ దుర్గామాత దేవాలయ ఏకాదశ వార్షికోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవాలయంలో పందిళ్లు వేయించి, వసతులు కల్పించారు. తొలి రోజు రేణుకా ఎల్లమ్మ దేవతకు పుట్టబంగారం తీసుకొచ్చారు. అలాగే దుర్గమ్మ, ఎల్లమ్మ తల్లులకు ఆనవాయితీ ప్రకారం పూసల సంఘం ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ, గంధం, గాజులు, ముత్యాలు, పూలు చీరె సారెలను సమర్పించారు. 15న(నేడు) రేణుకా ఎల్లమ్మ కల్యాణం, విజయ దుర్గామాతకు పుట్టబంగారం తేవడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 16న బోనాలు సమర్పణ, 17న వనభోజనాలు నిర్వహించనున్నారు.

సోమేశ్వరాలయానికి భక్తుల తాకిడి



పాలకుర్తి, న్యూస్‌టుడే: దసరా పండగ నేపథ్యంలో సొంతూళ్లకు వచ్చిన ప్రజల తాకిడితో సోమవారం పాలకుర్తిలోని సోమేశ్వరాలయం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. స్వామివారి దర్శనానికి అర గంట వరకు సమయం పట్టింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవాదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కాంగ్రెస్ అధిష్ఠానం ఆరా..!



అనిల్‌ను పరామర్శిస్తున్న వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు స్వర్ణ, కుడా ఛైర్మన్ వెంకట్రామిరెడ్డి

రంగంపేట, న్యూస్‌టుడే: 'ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో ఏం జరుగుతోంది?, గీసుకొండ మండలం ధర్మారంలో ఫ్లెక్సీ వివాదం ఏమిటి?, మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వర్గాల మధ్య గొడవలు ఎందుకు? ఇద్దరి మధ్య దూరం పెరగడానికి కారణాలేమిటి?' తదితర అంశాలపై కాంగ్రెస్ అధిష్ఠానం ఆరా తీసింది. సోమవారం నిఘా వర్గాల ద్వారా సమగ్ర నివేదిక సీఎం రేవంత్ రెడ్డి వద్దకు చేరింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రేవూరితో చరవాణిలో మాట్లాడినట్లు తెలిసింది. తొందరపడి ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని ఇద్దరికి సూచించినట్లు సమాచారం. వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా ఛైర్మన్ వెంకట్రామిరెడ్డి సోమవారం ఉదయం ధర్మారం వెళ్లేందుకు సిద్ధం కాగా, పోలీసు అధికారుల సూచనతో విరమించుకున్నారు.

బాలవిజ్ఞాన ప్రదర్శన పోటీలు



సులభ పద్ధతిలో గణితం నేర్పుతున్న ఉపాధ్యాయుడు ముడిదె రాము

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: రాబోయే రోజులన్నీ గణితం, సైన్సు ఆధారిత విషయాలను ఆకళింపు చేసుకున్న విద్యార్థులకే గుర్తింపు ఉంటుందని గమనించిన జాతీయ విద్య పరిశోధన శిక్షణ మండలి(ఎన్సీఈఆర్టీ) విద్యార్థి ఉపాధ్యాయులలో ఈ విషయం మరింత ఆసక్తి పెంచేందుకు ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు ఆదేశాలు జారీ చేసింది. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మరింత సృజనాత్మకంగా ఆలోచించేందుకు ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యంలో నవంబర్‌లో మూడంచెల పోటీ నిర్వహించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. విధి విధానాలకు ఆదేశాలు జారీ చేస్తారని జనగామ జిల్లా సైన్సు అధికారి పాకనాటి రఘునందన్ రెడ్డి తెలిపారు.

❒ 6 నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులు, తొమ్మిది నుంచి 12 తరగతి విద్యార్థులును రెండు విభాగాలుగా గుర్తించారు. సుస్థిర భవిష్యత్‌కు సైన్సు సాంకేతికత అనే ప్రధాన అంశంతో పాటు మరో ఏడు సబ్ థీమ్స్ ప్రకటించారు.

❒ విద్యార్థుల ఆరోగ్యం, ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, రవాణా, సమాచార వ్యవస్థ, ప్రకృతి ఆధారిత సాగు, డిజాస్టర్ మేనేజ్‌మెంటు, మ్యాథమెటికల్ మోడలింగ్, కంప్యూటరైజేషనల్ థింకింగ్, వేస్ట్ మేనేజ్‌మెంటు, రిసోర్సు మేనేజ్‌మెంట్ అనే ఏడు అంశాల ఆధారంగా ప్రదర్శనలు సిద్ధం చేసుకోవాలని విద్యార్థులను ఆదేశించారు.

❒ శిక్షణలో ఉన్న ఉపాధ్యాయులు, సేవలలో ఉన్న ఉపాధ్యాయులుగా రెండు వర్గాలుగా విభజించారు. వీరు ఇన్నోవేటివ్ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ బై టీచర్స్ అనే విషయమై ప్రదర్శనలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఉదయం ప్రదర్శనలు, మధ్యాహ్నం సమగ్ర ఆరోగ్యానికి చిరుధాన్యాల అవసరంపై సెమినార్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.